


విధుల్లో మంచి పేరు తెచ్చుకోండి: కమిషనర్



కారుణ్య నియామక పత్రాలు అందిస్తున్న మేయర్ అముద

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : ఉద్యోగ విధులు చిత్తశుద్ధితో నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని మేయర్ ఎస్ అముద హితవు పలికారు. నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాల ద్వారా ఇద్దరికి మంగళవారం ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన అప్పాదొరై, షణ్ముగం కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాలకు నగర కమిషనర్ డాక్టరు జె అరుణకు దరఖాస్తులు సమర్పించారు. కమిషనర్ దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాలను పరిశీలించి కుటుంబ సభ్యుల విచారణ చేపట్టారు. అప్పాదొరై కుమారుడు ఎ ఉదయ్ కుమార్‌కు పార్క్ వాచ్ మెన్‌గా, షణ్ముగం కుమారుడు కె ఎస్ జీవా ను ఎలక్ట్రీషియన్ గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను మంగళవారం మేయర్‌కి అందించారు.





'రాజధాని' చుట్టూనే 'బడ్జెట్'

'వెనుకబాటు' ఊసేలేదు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్ : 'రాజధాని' అమరావతి చుట్టూనే కేంద్ర బడ్జెట్ తిరగాడింది.. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' అంటూ అందరితో మనం ఉన్నాం అన్న ప్రత్యేకించి వెనుకబడి జిల్లాలైన తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఒరిగిందేమీ లేదనే చెప్పాలి. పేద, మధ్యతరగతి ప్రజల గృహ నిర్మాణాలకు 10 లక్షల కోట్లు కేటాయించారు. అందులో మనం ఉంటాం. అలాగే మహిళలు, బాలికల పథకాలకు 3 లక్షల కోట్లు ప్రతిపాదించారు. పన్ను చెల్లింపుదారులకు కొంతమేర ఉపశమనం కల్పిస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను వెల్లడించారు. ఏదిఏమైనా బడ్జెట్‌పై రాజకీయ ప్రతినిధుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. టిడిపి కూటమి మాత్రం రాజధానికి నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరంగా ప్రకటించారు. అయితే జిల్లాకు ఏంటనేది? వారి దగ్గర సమాధానం లేదనే చెప్పాలి. లెదర్ ఉత్పత్తులపై పన్ను తగ్గిస్తూ, ప్లాస్టిక్ వాటిపై వాయించింది.

మొబైల్స్, సోలార్ ఉత్పత్తులపై పన్ను తగ్గించింది. అలాగే బంగారం, వెండిపై ఆరు శాతం, ప్లాటినంపై 6.4 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గిస్తోంది. మూడు రకాల క్యాన్సర్ మందులపైనా పన్నులు తగ్గించింది. మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్లపై స్టాంపుల డ్యూటీ తగ్గించింది. మహిళలకు ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక హాస్టల్స్ ఏర్పాటు చేయనుంది. ముద్ర రుణాలను 10 లక్షల నుంచి 20 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఉద్యోగులకు నిరాశే..

- సరిత, యుటిఎఫ్ చిత్తూరు జిల్లా కార్యదర్శి.



ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిరాశ పరిచింది. ఓపిఎస్ కొనసాగిస్తామని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించే ఉద్దేశాలు లేవని లిఖిత పూర్వకంగా ఇవ్వడం పట్ల ఉద్యోగులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగిగా విధులు చేపడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లిస్తున్నామని ప్రస్తుతం కొనసాగుతున్న సిపిఎస్ విధానంలో అధికంగా పనులు చెల్లిస్తూ ఉద్యోగుల నష్టపోతున్నారు. దీని కోసం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తారని పలు ఉద్యమాలు చేపట్టినా ఫలితాలు లేవు..

మాటలు ఘనం.. నిధులు స్వల్పం

- వాడ గంగరాజు, సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి.



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. మాటలు ఘనం నిధులు నిల్ అన్నట్లుగా వుంది. ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. ఆర్థిక మంత్రి చెప్పిన మాటల్లో స్పష్టత లేదు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజల్ని మోసగించడానికి కేంద్రం ప్రయత్నించింది. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనడం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదు. 15 వేల కోట్ల రూపాయలు నేరుగా గ్రాంటుగా ప్రకటించాలి. వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం అన్యాయం. ప్రాజెక్టులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదు. పోలవరానికి 12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా బడ్జెట్‌లో స్పందన లేదు.. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములైన టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి. పార్లమెంటులో రాష్ట్ర ఎంపీలు బడ్జెట్లో న్యాయం కోసం పోరాడాలి..

విభజన హామీల ఊసేది : వి.నాగరాజు, తిరుపతి జిల్లా కార్యదర్శి, సిపిఎం



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ జిల్లావాసులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. మాటలు ఘనం.. నిధులు నిల్ అన్నట్లుగా ఉంది. ఎన్నికల అనంతరమైనా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అంశాలు అమలు చేస్తారని అందరూ ఆశించారు. మన్నవరం పునరుద్ధరణగానీ, కడప ఉక్కు గురించి గానీ ప్రస్తావనే లేకుండా పోయింది. రెండు పారిశ్రామిక కారిడార్లకు నిధుల గురించి ప్రస్తావన లేదు.

ఉద్యోగ కార్మిక వ్యతిరేక బడ్జెట్ : కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉద్యోగ కార్మిక వ్యతిరేక బడ్జెట్‌గా ఉంది. ప్రతి ఏటా కోటిమందికి ఉపాధి కల్పించేందుకు మూడు పథకాలు ప్రవేశపెట్టామని గొప్పగా చెప్పారు. వాస్తవంగా ఈ పథకాలేవీ ఉపాధి పెంచేవి కావు. కొత్తగా ఉద్యోగం ఇచ్చిన యజమానులకు మొదటి నెల జీతాన్ని తిరిగి చెల్లిస్తామని, అలాగే కొత్త ఉద్యోగులకు యజమానులు చెల్లించాల్సిన ఈపిఎఫ్ వాటాను ప్రభుత్వం మరి కొంత కాలం పాటు చెల్లిస్తుందని అందువల్ల ఉద్యోగాలు పెరుగుతాయని చెప్పిన మాట వాస్తవం కాదు. ఇవి ప్రజల డబ్బులను యజమానులకు దోచిపెట్టే పథకాలు మాత్రమే. 2022 - 2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధికి ఖర్చు చేసిన మొత్తం కంటే ఈ బడ్జెట్లో చేసిన కేటాయింపు తక్కువగా ఉంది. ఇక పెరిగేది ఎక్కడ?

మోడీ కుర్చీని కాపాడుకునే బడ్జెట్

- టిక్కీ రాయల్, కాంగ్రెస్ చిత్తూరు నగర అధ్యక్షులు.



కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు వేసే రకంగా వుంది. సామాన్యుల నడ్డి విరిచి ఉద్యోగాలు చేసుకొని కష్టపడి సంపాదించే వాళ్లపై అత్యధికంగా టాక్స్‌లు వేసి అదే అదాని, అంబానీలకు ఊరట కల్పించే బడ్జెట్.. రాష్ట్రాలను పణంగా పెట్టి మిత్ర పక్షాలను బుజ్జగించేందుకు, కాపాడుకునేం దుకు చేసిన ప్రయత్నం.. బంగారం, వెండి మీద టాక్స్ లు తగ్గిస్తారు. సామాన్య, మధ్యతరగతి ఉద్యోగుల జీతాలపై ఆధారపడి బతికే వాళ్ల నడ్డి విరిచేలా కేంద్ర బడ్జెట్ వుంది.

ఏపీకి ఇచ్చేది గ్రాంటా? అప్పా? : గురుమూర్తి, ఎంపి



ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పలేదు. మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు గ్రాంటా? లేక అప్పా? అనేది తేల్చాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పు భారాన్ని మోపవద్దు. పోలవరాన్ని పూర్తి చేస్తామని పదేళ్లుగా కేంద్రం చెబుతూనే ఉంది. పోలవరానికి నిధులిస్తున్న పాపాన పోలేదు. ఎపి విభజన సమస్యల పరిష్కారానికి పదేళ్లుగా పార్లమెంట్‌లో వైసీపీ పోరాడుతోంది. అయినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఎపితో పోలిస్తే బీహార్‌కు అత్యధిక ప్రాజెక్టులు ఇచ్చారు.



గుడిపల్లి మండలంలో నారా భువనేశ్వరికి సాదర స్వాగతం

దత్తత గ్రామాల్లో నారా భువనేశ్వరి

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం కంచిబందార్లపల్లిని దత్తత తీసుకుని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మౌలిక సమస్యలు పరిష్కరిస్తామని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి వెల్లడించారు. నారా చంద్రబాబునాయుడుకు భారీ మెజార్టీని ఇచ్చిన గ్రామాలను దత్తత తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా భువనేశ్వరి ఎన్నికల హామీగా గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన ఆమె మంగళవారం సాయంత్రం గుడిపల్లి మండలంలో పర్యటించారు. చంద్రబాబునాయుడు సిఎం అయిన తరువాత తొలిసారిగా కుప్పం నియోజకవర్గానికి విచ్చేసిన ఆమెకు ఘన స్వాగతం లభించింది. క్రేన్లతో భారీ పూలమాలలు వేశారు. అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు. తొలుత మండలంలోని కమ్మగుట్టపల్లి గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎక్కడైతే తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చిన గ్రామాల్లో ఆమె పర్యటించనున్నారు. గుడిపల్లి మండలంలోని కంచిబందార్లపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లి, చీకటిపల్లి పంచాయతీ కోటపల్లిల్లో పర్యటించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, పార్టీ అధ్యక్షులు టిఎం బాబునాయుడు పర్యటనలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 8.35కు బయల్దేరి నారా భువనేశ్వరి 12.15 గంటలకు విమాన, రోడ్డు మార్గాల్లో గుడిపల్లికి చేరుకున్నారు. సాయంత్రం కుప్పం పిఇఎస్ గెస్ట్‌హౌస్‌లో బస చేయనున్నారు.



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ విభాగాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎన్టీఆర్ వైద్య సేవలు విస్తృతం

- మెరుగైన వైద్యం, పారిశుధ్యానికి చర్యలు
- జిల్లా ప్రధాన ఆస్పత్రి తనిఖీలో కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలను విస్తృతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి లో డయాలసిస్, ఎక్స్ రే, క్యాజువాలిటీ, ఓపి వార్డు, పీడియాట్రిక్, గైనిక్, లేబర్ వార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడు తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలలో ఎంసిహెచ్, రేడియాలజీ విభాగాలను పరిశీలించా మని తెలిపారు. రేడియాలజీ ద్వారా ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్, డయాలసిస్ ద్వారా రోగులకు అంది స్తున్న సేవలను, ఆస్పత్రిలో నూతనంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించా మన్నా రు. ప్రభుత్వ ఆస్పత్రి, అపోలో సిబ్బంది ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నామని దీన్ని మరింత మెరుగు పరచ నికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజూ అధిక సంఖ్య లో రోగులు వస్తున్నారని, వారికి మెరుగైన వైద్య సదుపాయాలు, కనీస మౌలిక సదు పాయాలు ఏర్పాటు, భోజన వసతి, పారి శుధ్యం, ప్రభుత్వం నుండి అందాల్సిన ఆర్థిక సాయం తదితర అంశాలపై ప్రభుత్వ ఆస్పత్రి సూపరిం టెం డెంట్, అపోలో సిబ్బందితో సమీక్షిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన ఆస్పత్రిలో రోజుకు 1500 ఓపి కేసులు వస్తున్నా యని యూరాలజీ, న్యూరో సర్జరీ సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తు న్నారని, డయాలసిస్ సేవలకు సంబంధించి రోజుకు 48 మందికి నాలుగు షిఫ్ట్‌లలో సేవలు అందిస్తామని మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ అరుణ్ కుమార్ కలెక్టర్‌కు వివరించా రు. ఈ కార్యక్రమంలో అపోలో సిసిఓ నరేష్ కుమార్ రెడ్డి, అపోలో మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ రంగ నాథ్, డాక్టరు సంధ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతుల వివరాలు

అందుబాటులో ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పశు వైద్య శాలల పరిధిలో పశు సంపద కలిగిన పాడి రైతుల రైతుల వివరాలు అందు బాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక బహువిధ పశు వైద్యశాల, ప్రాంతీయ పశు నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయాలను కలెక్టర్ మంగళవారం సందర్శించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సలహాలు, సూచనలను చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పశుసంవర్ధక శాఖ లో పనిచేస్తున్న వారందరూ ఎపిఎఫ్ఆర్ఎస్ యాప్, పశు సంవర్ధక యాప్‌లో హాజరు నమోదు చేయాలనన్నారు. ప్రతి సహాయ సంచాలకులు, డాక్టర్ల పనితీరుపై వారాంతపు రిపోర్టులను సమర్పించాలని, వెటర్నరీ అసిస్టెంట్లతో త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు చేసే విధులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం పశువైద్య చికిత్స వివరాలు సమర్పించాలనన్నారు. స్థానిక వీధికుక్కల సమస్య ను నివారించడానికి ఒక వినూత్న కార్యాచరణను అమలు పరచాలని సంయుక్త సంచాలకులు, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ కు సూచించారు. జిల్లా లో పశు వైద్యశాలలు 14 వున్నాయని,14 మంది సహాయ సంచాలకులు పనిచేస్తున్నారని, 68 మంది వెటర్నరీ డాక్టర్లు వున్నారని, 77 మంది పారా వెటర్నరీ సిబ్బంది, 282 వెటర్నరీ అసిస్టెంట్లు వున్నారని జెడి డాక్టరు ప్రభాకర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో పశు సంవర్ధక శాఖ డిడి సుబ్బమ్మ, బహువిధ పశు వైద్యశాల, స్థానిక పశు వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అనర్హులకు తహశీల్దారు ఉద్యోగాలు!

- మానసిక వేదనలో సీనియర్లు
- అర్హులు డిటిలుగానే కొనసాగింపు
- ఉద్యోగం నచ్చక మెడికల్ లీవ్‌పై వెళ్లాలనుకుంటున్న వైనం
- జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లతో డిటికి శిరోభారం
- ప్రక్షాళనకు నిరీక్షణ

ప్రజాశక్తి - వెదురు కుప్పం : తహశీల్దారు ఉద్యోగ అర్హతలు ఉన్నా గత ప్రభుత్వం అడ్డగోలుగా ఉద్యోగ బాధ్యతలు అప్పగించింది. దీంతో సీనియర్లుగా ఉన్న డిప్యూటీ తహశీల్దారులు మనోవేదనకు గురి అవుతున్నారు. ఆ ఉద్యోగాల్లోనే కొనసాగుతున్నారు. చేసే ఉద్యోగం నచ్చక ఎన్నోసార్లు వైద్య సెలవులపై వెళ్లాలని ఆలోచనలో ఉన్నారు. డిటి మాటలను విధులు నిర్వహిస్తున్న జూనియర్ సీనియర్ అసిస్టెంట్లు వినకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు.

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 87 మంది తహశీల్దారు ఉద్యోగాలు ఉన్నాయి. ఇందులో 69 మంది తహశీల్దారులు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ ప్రాంతాలకు ఉద్యోగ నిమిత్తం బదిలీపై వెళ్లారు. మిగిలిన ఐదుగురు యథాస్థానంలో తహశీల్దారులుగా గానే కొనసాగు తున్నారు.11 మంది తహశీల్దారు జనవరి జూన్ మధ్యలో ఉద్యోగ విరమణ పొందారు. జిల్లాలో ఇద్దరూ అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడి విధులకు దూరంగా ఉన్నారు. ఈ కేసు ఏసీబీ కోర్టులో వుంది. ఉద్యోగ విరమణ పొందిన 11మంది తహశీల్దారుల ఉద్యోగ స్థానాలు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. ఈ నియామకాలు డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న వయస్సు ప్రతి పాదకన మాత్రమే కేటాయింపులు జరగాలని కొందరు సీనియర్ల అభిప్రాయం. ఇదే నియమ నిబంధనలు అని చెబుతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్యాం ప్రసాద్ రెడ్డి సీనియర్ అసిస్టెంట్ నుండి డిప్యూటీ తహశీల్దారుగా ఉద్యోగోన్నతి వచ్చింది. ఇతను గత కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాల హయాం నుండి పుంగనూరు నియోజకవర్గ సదుం, సోమల మండలాలలో తహశీల్దారు కార్యాలయలలో విధులు నిర్వహించారు. ఇతను చాలా జూనియర్. అయితే గత ప్రభుత్వం రైతు భూముల రీ సర్వే కోసం తహశీల్దారు కార్యాలయంలో ఉన్న ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్లను డిప్యూటీ తహశీల్దారుగా ఉద్యోగోన్నతిపై నియమించింది. వారిలో కొంత మందిని ప్రస్తుతం తహశీల్దారులుగా కొనసాగుతున్నారు. దీంతో సీనియర్లుగా ఉన్న డిప్యూటీ తహశీల్దారులు, జూనియర్లు కింద విధులు నిర్వహించలేక మనోవేదనకు గురవుతున్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి ఈ ఉద్యోగ నియామకాలను క్రమబద్ధీకరణ చేయాలని పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగస్తులు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం ఎలా స్పందించి ప్రక్షాళన చేస్తుందో వేచి చూడాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సోమల విద్యార్థులు

ప్రజాశక్తి -సోమల: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సోమల మండలం సూరయ్య గారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఐరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొన్న అనిషా, అనన్య, వేదమూర్తి, గణేష్ మంచి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ఆగస్టు 17 ,18, 19వ తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో వారు పాల్గొననున్నారని పీడీ శివకుమార్ తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అందరికీ అందుబాటులో ఆధార్ సేవలు

- 23 నుంచి 27 వరకు ప్రత్యేక శిబిరాలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



సంక్షేమ పథకాల లబ్ధి పొందాలన్నా, పాఠశాలలో చేరాలన్నా, ఉద్యోగం చేయాలన్నా, ఆఖరకు సెల్ఫోన్ సిమ్ తీసుకోవాలన్నా ఆధార్ తప్పనిసరి అయ్యింది. తరచూ ఆధార్‌కు నవీకరణ మార్పులకు సంబంధించి జనం మీసేవ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతుంటారు. కాగా ఇవి అందరికీ అందుబాటులో లేకపోవడంతో దూరంగా ఉన్నవారికి సేవలు పొందడం భారంగా మారింది. దీంతో ఈ నెల 23 నుంచి ప్రజలకు చేరువలో ఆధార్ సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి మండలంలో ఐడి పొందిన నలుగురు డిజిటల్ సహాయకులు ఒక్కో రోజు ఒక్కొక్క సచివాలయంలో అందుబాటులో ఉంటారు. స్థానికులు ఇక్కడకు వెళ్లి తమ ఆధార్ నవీకరణ మార్పులు చేర్పులు పొందే అవకాశం ఉంటుంది. సేవలకు సంబంధించిన రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి -పూతలపట్టు: ప్రస్తుతం చాలా సందర్భాల్లో ఆధార్ ప్రామాణికంగా మారింది. బ్యాంకు ఖాతాలు తెరవడానికి విద్యా వైద్యం చిరునామా వయస్సు ఇలా అన్నింటికీ దీన్నే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్ తీయించుకొని పదేళ్లు దాటిన వారికి నవీకరణ తప్పనిసరి చేశారు. దీనిలో భాగంగా వేలిముద్రలు కంటిపాప (ఐరిస్) నమోదు చేస్తారు. ఇక వీటితో పాటు చాలా మందికి నివాసం వయస్సు పేర్లలో తేడాలు ఉండటం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి వాటిని సరి చేయించుకోవడానికి ఆధార్ కేంద్రాలకు వెళితేనే పని జరుగుతుంది. కానీ మండల కేంద్రాల్లో ఒకటి రెండు కేంద్రాలు మాత్రమే ఉంటున్నాయి. ఇక కొన్ని పంచాయితీలకును సమూహంగా గుర్తించి ఒక్కో మండలానికి సగటున నాలుగు సచివాలయాల్లోనూ ఈ సేవలను అందుబాటులో ఉంచుతున్నారు. అయినా దూర గ్రామాల వారు మండల కేంద్రాలకు తమకు కేటాయించిన సచివాలయాలకు రావడం ఇబ్బందిగా మారుతుంది. ప్రధానంగా నడవలేక ఇబ్బంది పంపడే వారు వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు, చాలామంది తమ పని నిమిత్తం ఆరోజు కూలి పనిని మానుకొని కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతో ప్రతి సచివాలయంలోనూ ఒక్కో రోజు ఆధార్ సేవలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఈ ప్రక్రియ సాగుతుంది.

గ్రామాల వారిగా సమాచారం..

గ్రామాల్లో వివిధ అవసరాల నిమిత్తం ఆధార్ సేవలు పొందాల్సిన ప్రజలు చాలానే ఉన్నారు. వీరి కోసం ఐదు రోజులపాటు శిబిరాలు పెంచుతున్నాం. 17 ఏళ్లు లోపు ఉన్న వారందరికీ నవీకరణ ఉచితంగా చేస్తారు. విద్యార్థులకు ఎక్కువ అవసరం ఉంటే వాటి జాబితాలను ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు సూచిస్తాం. సిబ్బంది అక్కడే వెళ్లి సేవలు అందిస్తారు. సచివాలయాల్లోకి ఏ రోజున సచివాలయంలో అందుబాటులో ఉంటారో దానికి సంబంధించి ఎంపీడీవోలకు షెడ్యూల్ తయారు చేసి ఇచ్చారు. దీనికనుగుణంగా ఆయా గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజలకు తెలుపుతాం. ప్రజలు ఈ అవకాశాలను అన్ని విధాల సద్వినియోగం చేసుకోవాలి.

- పసన్న కుమారి, ఎంపీడీవో, పూతలపట్టు.

ఆగని ఏనుగుల దాడులు

- బాక్సుల్లో నింపిన టమాటాలు ధ్వంసం
- టమాట పంటపై దాడి

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీలో పంట పొలాలపై ఏనుగుల దాడి కొనసాగుతోంది. బాక్సుల్లో నింపి మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచిన టమోటాలను మంగళవారం కూడా ఏనుగులు ధ్వంసం చేశాయి. భాను ప్రకాష్ నాయుడు, కృష్ణమ్మ నాయుడు, నాగేశ్వరరావు, మణి, గొల్లపల్లి మునీశ్వర, శేషమ్మ, వెంకటరత్నం, తదితర రైతులకు చెందిన టమోటా పంటలపై ఐదు ఏనుగుల గుంపు దాడి చేసి రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. శేషమ్మ వెంకటరత్నం మునీశ్వర టమేటా పొలం వద్ద బాక్సులకు టమోటాలను నింపి మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచి ఒక ట్రిప్పు మార్కెటుకు తోలి రెండవ ట్రిప్పు బాక్సులను తరలించేందుకు వచ్చి చూడగా అప్పటికే బాక్సులను తోసివేసి ధ్వంసం చేసి నష్టం కలిగించాయని రైతులు ఆవేదనతో తెలిపారు. దాదాపు 160 టమోటా బాక్సులను ధ్వంసం చేశాయని వారు తెలిపారు. ఇరికిపెంట చెన్నపట్నం చెరువు కట్ట కింద శంకరాపురం వెళ్లే మార్గంలో పలువురి రైతుల టమోటా పంటలపై దాడి చేసి తొక్కి వేసి నష్టం కలిగించాయని రైతులు అంటున్నారు. అటవీ శాఖ సిబ్బంది సహాయ సహకారాలు లేకపోవడం కారణంగా తామే టపాసులు కొనుక్కుని వచ్చి ఏనుగుల కదలికలను గుర్తించి వాటిని ఇతర ప్రాంతాలకు తరిమే ప్రయత్నాలు చేస్తున్నామని రైతులు ఆవేదనతో తెలిపారు. కనీసం పంట నష్టం జరిగిన రైతులను కూడా అటు రెవెన్యూ ఇటు ఉద్యానవన శాఖ అటవీ శాఖ వారు వచ్చి పరిశీలించిన పాపాన పోలేదని రైతులంటే వీరికి ఎంత చిన్న చూపు వుందో అర్థమవుతుందని ఆగ్రహంతో రైతులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. మండలంలో ఎన్నో సంవత్సరాలుగా ఏనుగుల సమస్య ఉన్న కనీసం వాటిని అరికట్టి రైతులను, రైతుల పంట పొలాలను కాపాడాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు కానీ లేదని ఇది ఇలాగే కొనసాగితే తాము అప్పులు చేసి పండించిన పంటలు ఏనుగుల ధ్వసంలో పోగొట్టు కోవాల్సిందేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు ఏనుగుల బారి నుండి రైతులను, రైతుల పంట పొలాలను కాపాడి రైతుకు రక్షణ కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఏనుగులు టమోటా బాక్సులను ధ్వంసం చేసిన దృశ్యం

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య రాగి జావను బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని అందులో భాగంగా రాగి జావను ప్రతి మంగళవారం అందిస్తున్నారని పౌష్టికాహారంలో భాగంగానే రాగిజావను అందిస్తున్నామని ఇదే కాక మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఎంతో ఇష్టంగా రాగిజావను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత


విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లి మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో విద్యార్థులు 82 మందికి ఆవుల పల్లె గ్రామానికి చెందిన శేషం చంద్రయ్య తల్లి శేషం లక్ష్మమ్మ చేతుల మీదుగా విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తల్లి, కుమారుడు ఇద్దరూ విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులు విద్యా సామగ్రి పూర్తిస్థాయిలో కలిగి ఉండాలన్న సదుద్దేశంతో వారికి పలక, బలపం, పెన్నులు, పెన్సిళ్లు, నోటు పుస్తకాలు పంపిణీ చేశామని దాత లక్ష్మమ్మ అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జరీనా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

26న కృత్రిమ అవయవాల కోసం కొలతల స్వీకరణ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లా లోని విభిన్న ప్రతిభావంతులకు ఈ నెల 26 న తేదీ శుక్రవారం విశాల్ మార్ట్ పక్కన, తపోవనం, చిత్తూరులో కృత్రిమ కాలు క్యాంప్‌లో కాలు కొలతలు స్వీకరిస్తారని విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ అవయవాల కొలతలు తీసుకున్న వారికి 20 రోజుల తరువాత రూ.51వేల విలువ కలిగిన ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చనున్నట్లు పేర్కొన్నారు. కృత్రిమ కాలు కావలసినవారు సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభా వంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, నూతన కలెక్టరేట్ భవన సముదాయం, అంబేద్కర్ భవనం, రెడ్డిగుంట, చిత్తూరులో సంప్రదించాలని తెలిపారు. క్యాంప్ కు వచ్చే వారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికెట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో పాటు ఫోన్ నెంబర్ తో కూడిన సమాచారం ను 2 సెట్స్ కాపీలు తీసుకొని రావాలని తెలిపారు. రాజశేఖర్ నాయుడు : 9440357522,సోషల్ వర్కర్: 6281486722 ఈ ఫోన్ నెంబర్ లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశం ఇతర జిల్లాల విభిన్న ప్రతిభావంతులకు లేదని సహాయ సంచాలకులు తెలిపారు.

వేరుశనగ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రామకుప్పం: రైతులు పండించిన వేరుశనగ పంటలపై జాగ్రత్తలు తీసుకొని సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో వేరుశనగ పంటను వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తప్పనిసరిగా అంతర పంటలను వేసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ప్రభుత్వం ద్వారా పనిముట్లు, విత్తనాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏవో అమృత, సిబ్బంది ఆనంద్, తిప్పేస్వామి, ఆసిఫ్ రైతులు ఉన్నారు.

ఏపీకి వరాల జల్లు: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు కురిపించిందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే సాధ్యమైందన్నారు. ఏపీకి కేంద్రం బడ్జెట్లో వరాల జల్లు కురిపించడంపై చిత్తూరు పార్లమెంటు సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలపడం అభినందనీ యమన్నారు. విభజన చట్టం అంశాలను అమలు చేస్తామని, రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సహకారం అందిచనున్నట్లు కేంద్ర మంత్రి తెలపడం ఎన్‌డిఏ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల రూపాయిల నిధులు కేటాయించడం, పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహాయం అందించేందుకు కేంద్ర ముందుకు రావడం అభినందనీయమన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేక రాయితీలు, విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడర్ అభివృద్ధికి నిధులు కేటాయించడం, హైదరాబాద్ – బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వడంతో పాటు కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని కేంద్రమంత్రి స్పష్టం చేయడం శుభ పరిణామం అన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించడం పట్ల చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హర్షం ప్రకటిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుష్టు నివారణపై అవగాహన

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని కడపగుంట సచివాలయం పరిధిలో కుష్టు వ్యాధి కట్టడికి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై సిహెచ్‌ఓ శ్రీనివాసులు సిబ్బంది మంగళవారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు లెప్రసి ఎలా వస్తుంది? వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. ఈ వ్యాధికి అన్ని ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స ఉంటుందన్నారు. ఒంటిపై ఏదైనా మచ్చలు ఉంటే హాస్పిటల్ సిబ్బందికి తెలియపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి నవీన, ఆశా వర్కర్ మేరీ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి: ఎంపీడీవో

ప్రజాశక్తి -విజయపురం (నగరి): సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ప్రతి రోజూ బయోమెట్రిక్ అటెండన్స్ వేయాల్సిందేనని ఎంపీడీవో బ్రహ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎంలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది సచివాలయ సిబ్బంది స క్రమంగా బయోమెట్రిక్ అటెండన్స్ వేయడం లేదని, ఇకపై ప్రతి రోజూ మూడు సార్లు బయోమెట్రిక్ వేయాలని సూచించారు. అటెండన్స్ వేయకపోతే జీతం కట్ చేస్తానని హెచ్చరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 15 రోజలకు ఒక సారి ట్యాంకు, మురికి కాలువలను క్లీన్ చేయాలని సూచించారు. రోడ్డు పక్కన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పేడ దిబ్బలు తొలగించాలని సూచించారు. దోమల నివార ణకు ఫాగింగ్ చేయాలన్నారు. గ్రామాల్లో అనారోగ్య సమస్యలను, ఫీవర్ సర్వేలను ఎప్పటికప్పుడు నివేదిక పంపాలన్నారు. ప్రతి గ్రామంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ తాగునీటిని టెస్టు చేసి రిపోర్టు ఇవ్వాలని సూచించారు. పంచాతీలలో చెత్తను తరలించే ట్రై సైకిల్స్‌కు మరమ్మతులు చేయించి చెత్తలను సేకరించానికి ఉయోగించాలని, పారిశుద్ధ్య కార్మికులు ఇవ్వాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించాలని సూచించారు.

గుడిపల్లిలో ప్రబలుతున్న విష జ్వరాలు

నిద్రావస్థలో అధికారులు


పారిశుధ్య చర్యలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడుపల్లి మండలంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వైద్యాధికారులు, సిబ్బంది నిద్రావస్థలో ఉండడంతో గుడుపల్లి మండల ప్రజలు విష జ్వరాల బారిన పడి అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విష జ్వరాల కారణంగా గుడిపల్లి మండలంలోని గుండ్ల సాగరం, అత్తినతం గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ గ్రామాల్లో శానిటైజర్ చేసి గ్రామ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి కుప్పం నియోజక వర్గంలో నాలుగు రోజులు పర్యటనలో భాగంగా త్వరలో ఆమె పర్యటించ నుండడంతో ఈ విషయాలను పక్కనపెట్టి ఆమె పర్యటనను దిగ్విజయం చేయాలన్న లక్ష్యంతో ఈ విషయాలను దాస్తున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. గుడుపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీలో ఇలాంటి విష జ్వరాలు రావడంతో మండల ప్రభుత్వ వైద్యులు ఏమి చేస్తున్నారో తెలియడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తే మంచి దని లేకుంటే మండలంలో విష జ్వరాలతో తీవ్ర ఇబ్బంది పాలవుతారని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడుపల్లి మండలం గుండ్ల సాగరం గ్రామ పంచాయతీలో డెంగీ ప్రభావంతో సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్యం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తే ఇబ్బందులు లేకుండా ప్రజలకు మేలు చేకూరుస్తుందని కొంతమంది ప్రముఖులు కోరుతున్నారు. విష జ్వరాల ప్రభావంతో శానిటైజర్ చేస్తున్న మండల ఆరోగ్యశాఖ, విద్యార్థుల సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు: ఎస్‌పి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, వికోట : జిల్లాలోని గుడిపల్లి, వికోట పరిసర ప్రాంతాల్లో నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్ లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోస్ చెయ్యాలని సీఐ లింగప్పను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించా లన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసుల రికార్డులు పరిశీలిం చారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై అధికారులు ఆరా తీశారు. నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్య మైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. స్టేషన్ లోని క్రైమ్ రికార్డ్స్ ను, కేసు డైరీ, రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల్లో వృత్తి నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి త్వరితగతిన విచారణ పూర్తి చేసి, నిర్దేశిత కాల వ్యవధిలో కోర్ట్ లో ఛార్జ్ షీట్ ఫైల్ చేసి, సమర్థవంతమైన ట్రయిల్ ద్వారా నిందితులకు కఠిన శిక్ష పడేలా చెయ్యాలని సూచించారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవల్లోని, అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చెయ్యాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని స్కూల్స్ వద్ద , హోటల్స్ లాంటి ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి, పగలు బీట్ల పని తీరును నిరంతర మానిటరింగ్ చేస్తేనే నేరాలు తగ్గుతాయని తెలిపారు. భూ వివాదాలు, పాత గొడవలు మొదలైన వాటిని లిస్ట్ అవుట్ చేసి ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వి.కోట ఇన్‌స్పెక్టర్ లింగప్ప, వి కోట ఎస్ఐ బాబు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన



పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మూడవ సంవత్సరం బిజడ్‌సి విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకం కోర్సును మంగళవారం ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వంద్వ ప్రయోజనానికి ఉపయోగపడుతుందన్నారు. ఇది విద్యార్థులకు విలువైన హ్యాండ్ ఆన్ అనుభవాన్ని అందిస్తుందని, శిలీంద్రాలు గురించి వారి తరగతి గది పరిజ్ఞానాన్ని అమలు పరచాడనికి వీలు కల్పిస్తుందన్నారు. పండించిన పుట్ట గొడుగులు కళాశాల ఫ్యాకల్టీకి అమ్ముతారన్నారు. ఇది సంస్థలో ఆరోగ్యకరమైన, స్థిరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. జువాలజీ డిపార్ట్మెంట్ ఇన్‌ఛార్జి సుబ్రమణ్యం, విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలను పొందేలా చేయడంలో ఈ కోర్సు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విజయవంతంగా పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన పరిజ్ఞానం, మెళకువలను విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేకం గా సర్టిఫికెట్ కోర్సును ఏర్పాటు చేశామని ఆయన వివరిం చారు. అధ్యాపకు రాలు డాక్టర్ జి. స్వాతి పుట్టగొడుగుల పోషక ప్రయోజ నాలను గురించి వివరించారు. "పుట్ట గొడుగులు ఏదైనా భోజనానికి రుచికర మైన అదనంగా వుండడంతో పాటూ విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్ల గొప్ప మూలం అన్నారు. ఈ ప్రాజెక్ట్ తమ విద్యార్థులకు వారి స్వంత శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. స్టార్టప్ వ్యాపారం ద్వారా ఆదాయ వనరుగా ఉపయోగపడే పోషకమైన ఆహార వనరులను పెంపొందించు కోవడానికి శక్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరి : పుట్టగొడుగుల పెంపకంపై సర్టిఫికేట్ కోర్సును ప్రారంభిం చినట్లు నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం నూతన కోర్సు ప్రారంభాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడవ సంవత్సరం బీజడ్‌సీ విద్యార్థుల కోసం పుట్టగొడుగులను పెంచే కార్యక్రమాన్ని' ప్రారంభించామన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వంద్వ ప్రయోజనానికి ఉపయోగ పడుతుందన్నారు. ఇది విద్యార్థులకు విలువైన హ్యాండ్ ఆన్ అనుభవాన్ని అందించడంతో పాటు శిలీంధ్రాలు గురించి తరగతి గది పరిజ్ఞానాన్ని అమలు పరచాడనికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ కోర్సు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విజయవంతంగా పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన పరిజ్ఞానం, మెళకువలను విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సును ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి. స్వాతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లార్వాను నిర్మూలించాలి


దోమల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి -సోమల: నిలువ ఉన్న నీటిలో లార్వాలు వృద్ధి చెంది తోక క్రిములుగా పెరిగి చివరకు దోమలుగా అవతరించి అవి ప్రజలను కుట్టి డెంగీ, మలేరియా చికెన్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తికి కారణమవుతున్నాయని ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించి లార్వా నిర్మూలించి ఆరోగ్యకర సమాజానికి కృషి చేయాలని, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రజలకు పిలుపు నిచ్చారు. మంగళవారం పొదలకుంటపల్లి పంచాయతీ తుగడం వారి పల్లి పాఠశాలలో విద్యార్థులకు గ్రామస్తులకు దోమల నివారణ , ఆరోగ్యకర జీవనంపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వాలు అభివృద్ధి చెంది అవి దోమలుగా మారి డెంగీ బారిన పడిన రోగిని కుట్టి మళ్లీ ఆరోగ్యవంతమైన మనిషిని కుట్టడం వల్ల డెగీ వ్యాపిస్తుందని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాలు అనారోగ్యాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ముందస్తు జాగ్రత్తగా లార్వాలను అంతం చేస్తే మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం పిచ్చి మొక్కలు తొలగించడం పరిసరాలు పరిశుభ్రంగా వుంటే దోమలు వృద్ధి చెందకుండా ఆరోగ్యకరంగా ఉంటామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- రాష్ట్ర జన చైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి



ప్రజాశక్తి- పూతలపట్టు: విద్యార్థులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భయపడి కష్టపడి చదవడం వల్ల ప్రయోజనం లేదని, ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తును తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ఇష్టపడి చదివితే ప్రయోజనం ఉంటుందని రాష్ట్ర జన చైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి అన్నారు. పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదవ తరగతిలో 500 మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు రూ 18 వేలు ప్రోత్సాహక బహుమతులను పూతలపట్టు రవి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. రూ.2 లక్షలతో పాఠశాల ప్రహరీ గేట్ లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఆయనతోపాటు రవిరెడ్డి కుమారులు హర్షవర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి సహకరిస్తున్నారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. ఆ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు లు పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివైఈవో చంద్రశేఖర్, ఎంఈఓ లు దామోదర్ నాయుడు, మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పనులు ముమ్మరం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-పూతలపట్టు:

ఈనెల 22న 'పల్లె ప్రగతి అధోగతి' అనే కథనం ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన పూతలపట్టు నియోజకవర్గం లోని ఈవో పీఆర్ డి, అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను, రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను, మురుగునీటి కాలువలను శుభ్రం చేశారు. విష జ్వరాలు ప్రబలకుండా ఫాగింగ్ చేస్తున్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడంతో పాటు ప్రజల గృహ పరిసరాల్లో ఎలాంటి నీటి నిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో గ్రామీణ ప్రజలు ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.


కాలువలను శుభ్రం చేస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

గుర్తుతెలియని వాహనం ఢీ గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అమర్ రాజా బ్యాటరీ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రహదారిలో నడిచివెళుతున్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


పశువులకు వ్యాధి నివారణ టీకాలు ఇస్తున్న పశువైద్యులు

పశువులకు టీకాలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు బొబ్బలు రాకుండా ముందుస్తుగా పశువులకు నివారణ టీకాలు వేశారు. మండలంలోని మాంబేడు గ్రామంలో ఉన్న రైతు కుటుంబాలు పశువులకు స్థానిక లైవ్ స్టాక్ అసిస్టెంట్ డాక్టర్ విజయలక్ష్మి మంగళవారం టీకాలు వేశారు. ఆ గ్రామంలో సుమారు 150 పశువులకు పైగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మూడు నెలల పైపడిన లేగ దూడ నుంచి అప్పుడే ఈనే పశువు వరకి ఈ టీకాలు వేసుకోవచ్చని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలు పడవద్దని ఈ టీకాలు వేసుకోవడం వల్ల బొబ్బలు రాకుండా నివారించవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటముని పాల్గొన్నారు.

సమన్వయంతో పారిశుధ్యాన్ని మెరుగుపరచండి..

పంచాయతీ విస్తరణ అధికారి లక్ష్మీదేవి

ప్రజాశక్తి-సోమల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీల పరిధిలోని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, పైపులైన లీకేజీ అరికట్టడం, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్, మురుగునీటి కాలువలను శుభ్రపరచడం, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలను పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులతో, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పని చేయాలని పంచాయతీ విస్తరణ అధికారి లక్ష్మీదేవి అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా వర్షపు నీరు నిలువ ఉండకుండా సజావుగా పారే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి -గంగవరం: రాష్ట్రంలో ప్రభుత్వం ద్వారా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు డివి మునిరత్నం, పార్థసారథి పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయంలో శివన్న అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి స్కీం వర్కర్లైన అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, సంఘ మిత్రులు, మున్సిపల్ వర్కర్లు ప్రభుత్వాలు చేపడుతున్న, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అందించడంలో అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. అటువంటి వారిపై రాజకీయ కక్షలు, పనుల నుండి తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఐదు సంవత్సరాలకు ఓసారి ప్రభుత్వాలు మారినప్పుడు ఇలాంటి తొలగింపు కార్యక్రమాలకు పూనుకోవడం భావ్యం కాదని, వర్కర్లు పొరపాటు చేసినప్పుడు వారితో చర్చించి తప్పు తేలినప్పుడు ఒకసారి అవకాశమిచ్చి మళ్లీ తప్పులు జరగకుండా చూడాల్సి ఉందన్నారు. వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, ప్రోత్సాహకం, కల్పిస్తూ రాజకీయ వేధింపులు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనీ , సరస్వతి, గంగిరెడ్డి, సాంబశివ, బాబు, జనార్ధన్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: న్యూఢిల్లీ లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని తిప్పినాయుడు పల్లి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మంగళవారం కలిశారు. మాజీ సీఎం ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రానికి సంబంధించి సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు అక్కడ ధర్నా నిర్వహించ నున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు మద్దతుగా అక్కడకు చేరుకున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆయన వెంట రాష్ట్ర ఎస్‌సి సెల్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి కాలప్ప, వైసీపీ నాయకులు, , పాలసముద్రం మండలం పార్టీ అధ్యక్షుడు తులసి యాదవ్, ఎస్ఆర్‌పురం మండలం గురవారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం: ఏఈ

ప్రజాశక్తి -ఎస్ ఆర్ పురం : బుధవారం సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని విద్యుత్ శాఖ ఏఈ గిరి తెలిపారు. మంగళ వారం ఆయన మాట్లాడు తూ బుధవారం సాయంత్రం కొత్తపల్లి మిట్ట సబ్ స్టేషన్‌లో ఉన్న 132 కెవి విద్యుత్తు లైన్ల మరమ్మ తు పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడ నుందని మండల ప్రజలు , రైతులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మరమ్మతులకు నోచుకోని వాటర్ ప్లాంట్



- తాగునీటికి విద్యార్థుల ఇబ్బందులు - పట్టించుకోని అధికారులు

పజాశక్తి -గంగవరం: మండలంలోని గుండిగల్లు పంచాయతీ ఉన్నత పాఠశాలలో మూడు సంవత్సరాల క్రితం విద్యార్థులకు తాగునీటి కోసం సుమారు మూడు లక్షల రూపాయలు విలువచేసే వాటర్ ప్లాంట్ నిర్మించారు. కేవలం పది రోజులకే అది మరమ్మతులు నోచుకోవడంతో అప్పటి నుంచి ఇంతవరకు ఏ అధికారి కాని నాయకులు కాని చూసిన పాపాన పోలేదని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొంటున్నారు. అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ వాటర్ ప్లాంట్ ఎవరికోసం ఎందుకోసం నిర్మించారో అర్థం కాలేదని అంటున్నారు. ప్రస్తుతం గ్రామంలోని కొంత మంది దాతలు సహకారంతో విద్యార్థులు దాహార్తి తీర్చుకుంటున్నామని దాతలు ముందుకు రాకుంటే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉండేదని గతంలో విద్యార్థులు తమ ఇంటి నుండి వాటర్ బాటిలలో నీరు తెచ్చుకొని మధ్యాహ్నం భోజనం చేసేవారమని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయిస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు.